
నమస్తే తెలంగాణ
# జిందగీ
కరీంనగర్ | ఆదివారం
24 మార్చి 2024
www.ntnews.com







# రంగుల హోలీ పాటల కేళీ

నింగినున్న హరివిల్లు ఇలకు చేరే సందర్భం హోలీ! ఈ రంగుల పండుగ ఉరిమే ఉత్సాహాన్ని తెస్తుంది. రాబోయే వసంత సంతసానికి స్వాగత గీతం పాడుతుంది. అందుకే కాబోలు.. హోలీ అంటే సినీ జనాలకూ ఇష్టమే! చాలా సినిమాల్లో హోలీ కేళీ ఆధారంగా ఒక సన్నివేశమో, రంగు రంగుల గీతమో ఉండేలా ప్లాన్ చేస్తుంటారు. వీటిలో పండుగ వైభవాన్ని చాటే పాటలు కొన్ని ఉంటాయి. అంతేకాదు, హీరోయిజాన్ని చాటిచెప్పే సాంగ్ అయినా, కథానాయిక సొగసులను వర్ణించే సందర్భమైనా.. సినీకవులు రంగులన్నీ రంగరించి అందమైన పాటగా ప్రేక్షకులపై కుమ్మరిస్తారు.

**సినిమా** పాటల్లో పండుగలు తొంగి చూడటం బ్లాక్ అండ్ వైట్ రోజుల నుంచీ ఉన్నదే! ఈ స్పెషల్ గీతాల్లో దీపావళి, సంక్రాంతి పండుగలదే అగ్రభాగం. ఆ తర్వాతి స్థానాన్ని ఆక్రమించింది హోలీనే! టాలీవుడ్‌లో కన్నా బాలీవుడ్ గీతాల్లో హోలీ కేళీ ఎక్కువగా కనిపిస్తుంది. ఫక్తు హోలీ పాటలకన్నా రంగులద్దుకున్న పాటలెన్నో ఉన్నాయి. వన్నెచిన్నెల చెలిని పంచెవన్నెల చిలుకగా పోలుస్తూ గీత రచయితలు ప్రదర్శించే పాటవం, అందమైన పాటలుగా మనల్ని అలరిస్తుంటాయి. 'పచ్చందనమే పచ్చదనమే..' అని సాగే వేటూరి గీతం.. నీలాంబరాన దాగున్న కథానాయిక సౌందర్యాన్ని వర్ణించిన వైనం అద్భుతం. ప్రకృతిలో దాగున్న వర్ణాల వైభవాన్నంతా 'సఖీ' సినిమాలోని ఈ పాటలో ఏకరువు పెట్టేశారు సుందరరామ్మూర్తి. 'రవివర్మకే అందనీ ఒకే ఒక అందానివో..' పాటలో 'ఏ గగనమో కురుల జారి నీలిమై పోయె..' అని ముక్తాయింపు కలర్‌ఫుల్‌గా ఉంటుంది!

**పక్కా** హోలీ పాటలకొస్తే... ఈ రంగుల పండుగ నాడు వీధివీధిలో మార్మోగే పాట 'సందెపొద్దు మేఘం పూలజల్లు కురిసెను నేడు'. 'నాయకుడు' సినిమాలోని ఈ గీతం వినసొంపుగా ఉంటుంది. రంగుల పండుగ సందడితో చూడ ముచ్చటగా సాగుతుంది. 'మా సొంతం.. ఈ ఆనందం' అని రంగులు ఆడుకోవడానికి వీధిలోకి పరిగెత్తేలా చేస్తుంది. 'చక్రం' సినిమాలోని 'రంగేలీ హోలీ.. హంగామా కేళీ.. ఎక్కడ నువ్వుంటే అక్కడ జర గాలి..' పాట హోలీ సందడితోపాటు సిరివెన్నెల మార్కు సందేశాన్ని పంచుతుంది. నాగార్జున హీరోగా వచ్చిన 'మాస్'లో హోలీ పాట సూపర్ హిట్. 'కొట్టు కొట్టు కొట్టు.. రంగుదీసి కొట్టు..' అని మొదలయ్యే గీతం 'రంగులోనే లైఫ్ ఉంది' అని చాటిచెబుతుంది. 'మహానగరం' చిత్రంలోని 'హరివిల్లే వరదల్లే ఇల పైకి దిగివచ్చేనమ్మా..' పాట, ఈ రంగుల పండుగ ఎంతటి సంతోషాన్ని మోసుకొస్తుందో అభి'వర్ణి'స్తుంది. వెంకటేశ్ హీరోగా నటించిన 'జెమిని' చిత్రంలో 'దిల్ దివానా.. మై హసీనా..' పాట నేపథ్యం హోలీ పండుగే! 'జెమిని' టైటిల్ సాంగ్ హోలీ నాడు సంప్రదాయంగా తాగే బంగు ప్రభావంతో మొదలయ్యేదే! 'హోలీ రంగ హోలీ.. కేళీ చెమ్మకేళీ.. ఖుషీ జల్లుకోవాలి.. పోసుకున్నా రంగులే పూసలవ్వాలి' ప్రత్యేక గీతంలో హీరో విజయ్ దేవరకొండ చేసిన సందడి కలర్ ఫెస్టివల్ సంతోషాన్ని రెట్టింపు చేసేలా ఉంటుంది. 'క్రేజీ క్రేజీ ఫీలింగ్' సినిమాలోని 'ఏడాదికోసారి వచ్చే హోలీ.. జిందగీలో తెచ్చింది ఫుల్ రంగేలీ' పాట ఉల్లాస భరితంగా సాగుతుంది.



'హోలీ' పండుగ సన్నివేశాలకూ సినిమాల్లో కొదువ ఉండదు. 'ఇంద్ర' సినిమాలో జడివాన జాడతో నేలంతా పులకించిన తర్వాత వచ్చే హోలీ సందడి సినిమా కథను ఊహించని మలుపు తిప్పుతుంది. ఈ సినిమా విడుదలయ్యాక.. ఒక సన్నివేశంలో లోపం ఉందనీ, దాన్ని చెప్పిన వారికి ప్రైజ్‌మనీ ఇస్తామనీ చిత్రబృందం ప్రకటించింది. అయితే, చాలామంది రకరకాల లోటుపాట్లు అనుకున్నారు. కానీ, ఆ సినిమాలో చిరంజీవి పాత్రకు అక్కలు రాఖీ కడతారు. అయితే, అంతకు ముందు సీన్‌లోనే హీరో కుటుంబం హోలీ సెలబ్రేట్ చేసుకోవడమే అసలు లోపమని చిత్ర బృందం ప్రకటించడం గమ్మత్తు! ఇక ఉదయ్‌కిరణ్ హీరోగా వచ్చిన 'హోలీ' సినిమా మంచి విజయాన్నే సొంతం చేసుకుంది. చివరిగా, ఈ రంగుల హోలీని పాటల కేళీగా జరుపుకొంటే.. మన జిందగీకి కొత్త హంగులు వచ్చి చేరినట్టే!!

### బాలీవుడ్ హోలీ హిట్ సాంగ్స్

- రంగ్ బర్సే భీగీ చునర్ వాలీ- సిల్‌సిలా
- హోలీ కే దిన్- షోలే
- బాలమ్ పిచ్‌కారీ- యే జవానీ హై దివానీ
- ఆజ్ నా చోడేంగే- కాటీ పతంగ్
- అంగ్ సే అంగ్ లగానా- డర్
- జై జై శివశంకర్ కాంటా లగే నా కంకర్ - ఆప్ కీ కసమ్

# ఓం భీమ్ బుష్.. ఆయేషా ఖుష్

టాలీవుడ్‌లో దూసుకుపోతున్న బాలీవుడ్ బ్యూటీ ఆయేషా ఖాన్. హిందీ బిగ్‌బాస్ ద్వారా వచ్చిన క్రేజ్‌తో తెలుగులో చక్కటి అవకాశాలను అందుకుంటున్నది ఈ నటి! ఇక సోషల్ మీడియాలో ఆయేషా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా 'ఓం భీమ్ బుష్' సినిమాతో మరోసారి తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఆయేషా. గ్లామర్‌తో నెట్టింట హీట్ పుట్టిస్తున్న ఈ భామ గురించి మరిన్ని సంగతులు..

**ముంబయిలో** పుట్టిన ఆయేషా బుల్లితెరపై జూనియర్ ఆర్టిస్ట్‌గా తన కెరీర్ మొదలుపెట్టింది. 'బాలవీర్ రిటర్న్స్'తో మంచి గుర్తింపు పొందింది. తర్వాత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తన ప్రత్యేకత నిరూపించుకుంది. హిందీ బిగ్‌బాస్‌తో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న ఆయేషా బాలీవుడ్ టు టాలీవుడ్ జర్నీ కొనసాగిస్తున్నది.

**'ముఖచిత్రం'** సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఆయేషా కొన్నాళ్లు సీరియల్స్‌కే పరిమితమైంది. బిగ్‌బాస్ తర్వాత వరుస అవకాశాలు దొరకబుచ్చుకుంటున్నది. ప్రస్తుతం టాలీవుడ్‌పై ఫోకస్ చేసింది. విశ్వక్‌సేన్ హీరోగా రాబోతున్న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో ఐటం సాంగ్‌లో అదరగొట్టింది. దుల్కర్ సల్మాన్ చిత్రం 'లక్కీ భాస్కర్'లో మరో స్పెషల్ సాంగ్‌లో కనువిందు చేయనుంది.

**సోషల్** మీడియాలో ఆయేషాకు ఫాలోవర్లు ఎక్కువ. తరచూ హాట్ ఫొటోలు, వీడియోలు పోస్టు చేస్తుంటుంది. పాటలకు రీల్స్ చేస్తూ అభిమానులను అలరిస్తుంటుంది. సందేశాత్మక వీడియోలు కూడా పోస్టు చేస్తుంటుంది.

**'ఓం** భీమ్ బుష్'తో మంచి హిట్ సొంతం చేసుకున్న ఈ అమ్మడు త్వరలో మరో రియాలిటీ షోలో పాల్గొననుంది. రోహిత్ శెట్టి హోస్ట్ చేస్తున్న 'కత్రోన్ కే ఖిలాడీ' సీజన్ 14లో ఆమె కనిపించనుంది.










ఓటీటీ హిట్

# నేరం-శిక్ష

## అబ్రహం ఓజ్లర్

**డిస్నీ ప్లస్ హాట్‌స్టార్:** మార్చి 20
**నటీనటులు:** జయరామ్, మమ్ముట్టి, అనస్వర రాజన్, అరుజన్ అశోకన్ తదితరులు
**దర్శకత్వం:** మిథున్ మాన్యువల్ థామస్

**మలయాళం** సినిమాలు ఎల్లలు దాటొచ్చి ఇప్పుడు అందరినీ అలరిస్తున్నాయి. పక్కా స్క్రిప్ట్, పర్‌ఫెక్ట్ స్క్రీన్ ప్లే ఈ మలబారు చిత్రాలకు బ్రహ్మరథం పట్టేలా చేస్తున్నాయి. ఓటీటీ వల్ల కేరళ తీరం దాటిన సినిమాలు నైరుతి రుతుపవనాల్లా దేశమంతా విస్తరించి అలరిస్తున్నాయి. తాజాగా డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో రిలీజైన అబ్రహం ఓజ్లర్ కూడా రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేస్తున్నది. కథలోకి వెళ్తే.. అబ్రహం ఓజ్లర్ (జయరాం) ఐపీఎస్ ఆఫీసర్. అనుకోకుండా అతని భార్యాపిల్లలు కనిపించకుండా పోతారు. వాళ్లు ఏమయ్యారో అంతుబట్టక ఓజ్లర్ డిప్రెషన్‌లోకి వెళ్లిపోతాడు. మరోవైపు త్రిస్సూర్‌లో వరుస హత్యలు జరుగుతుంటాయి. నిందితుడు సర్జికల్ కత్తితో ఈ హత్యలు చేస్తుంటాడు. ఆ మృతదేహాల దగ్గర 'హ్యాపీ బర్త్ డే' అని రక్తంతో రాసిన కాగితాలు పడేసి వెళ్తుంటాడు. ఈ హత్య కేసులను చేధించడానికి ఓజ్లర్ రంగంలోకి దిగుతాడు. ఇంతకీ ఈ హత్యలు చేస్తున్నది ఎవరు? వీటికీ ఓజ్లర్ కుటుంబం మిస్సవ్వడానికి సంబంధం ఏంటి? అతిథి పాత్రలో కనిపించే అలెక్స్ (మమ్ముట్టి) ప్రాధాన్యం ఏమిటి? వీటన్నిటినీ ఆసక్తికరంగా మలిచాడు దర్శకుడు. ఫస్ట్ హాఫ్‌లో ఉన్నంత వేగం సెకండ్ హాఫ్‌లో లేకపోవడం కాస్త మైనస్. అయితే, సినిమా ఆసక్తికరంగానే ఉంటుంది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ అందుబాటులో ఉంది.

# అదే రహస్యం!



**బాలీవుడ్** నటి పరిణీతి చోప్రా ఓ ఇంటిదై ఆరు మాసాలు అవుతున్నది. ఈ సందర్భంగా తన భర్త రాఘవ్ చద్దాతో కలిసి హాఫ్ ఇయర్ సెలబ్రేషన్స్ చేసుకుంది. 'ఈ ఆరునెలల కాలం క్షణంలా గడిచిపోయింది. అందమైన జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నా! సోషల్ మీడియా చూడటం దాదాపు మానేశాను. ఇప్పుడు నా జీవితంలో సామాజిక మాధ్యమాల పాత్ర కేవలం ఒకే ఒక్క శాతం! నా ఫాలోవర్స్ కూడా మా దంపతుల విషయంలో పాజిటివ్‌గా స్పందిస్తుండటం సంతోషంగా ఉంది. ఈ ఆరు నెలల్లో మామధ్య మంచి అనుబంధం ఏర్పడింది. ఎక్కడికి వెళ్లినా మేడ్ ఫర్ ఈచ్ అదర్ అంటున్నారు. మా ఇద్దరివీ విభిన్న రంగాలు కావడంతో అనవసరమైన చర్చలకు అవకాశమే ఉండదు. మా ఆయనకు సినిమాల గురించి అంతగా పట్టదు. నాకు రాజకీయాలపై అవగాహన లేదు. కానీ, ప్రజా సమస్యలను మాత్రం అర్థం చేసుకుంటా!' అని చెప్పుకొచ్చింది పరిణీతి.

# మనసు పొరల్లో..

**బాలీవుడ్‌లో** పాగా వేసిన ఫ్రెంచ్ భామ కల్కి కొచ్లిన్ మంచి నటి మాత్రమే కాదు కవయిత్రి కూడా! ఆమె ఎమోషన్స్‌ను అక్షరీకరించి అద్భుతాలు ఆవిష్కరిస్తున్నది. 'నేను రచనలు చేస్తానని ఎన్నడూ అనుకోలేదు. ఒకానొక సమయంలో నా మనసులో రకరకాల భావోద్వేగాలు కలిగేవి! అవి ఎందుకు పుట్టేవో అంతుబట్టేవి కాదు! వాటిని ఎలా నియంత్రించాలో కూడా తెలిసేది కాదు. ఓ రోజు ఆ భావాల్లో కొన్నిటిని కాగితం మీద పెట్టాను. నాకు తెలియకుండానే కొంత రిలాక్స్ అనిపించింది. కవితలు రాస్తున్నప్పుడు నా మనసు తేలికైన భావన కలిగింది. ఇప్పటికైతే వాటిని పబ్లిష్ చేయాలనే ఆలోచన లేదు. ఏదో ఒకరోజు తప్పకుండా అచ్చు వేయిస్తానేమో!' అని చెబుతున్నది కల్కి.






# రావయ్యా.. మా అన్నయ్య!

**ఆసక్తికరమైన** సీరియల్స్‌తో తెలుగువారిని ఆకట్టుకుంటున్న జీ తెలుగులో మరో అందమైన డైలీ సీరియల్ ప్రసారం కానుంది. అన్నాచెల్లెళ్ల అనుబంధం, మానవ విలువలకు పట్టం కట్టే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ 'మా అన్నయ్య'. ఈ సీరియల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ బుల్లితెరకు పరిచయం అవుతుండటం విశేషం. ఈ నెల 25న సీరియల్ ప్రారంభం కానుంది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు ఇది ప్రసారం కానుంది. అనూహ్యమైన మలుపులతో తీర్చిదిద్దుతున్న 'మా అన్నయ్య' తెలుగు ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందని జీ తెలుగు యాజమాన్యం పేర్కొన్నది.